

అగ్నికి ఆహుతైన..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారుతోంది. 8లో ▸



అల్లుడే హంతకుడు

పుట్టింటికి వెళ్లిన భార్యను తిరిగి పంపలేదని కక్ష పెట్టుకున్న అల్లుడు మామను హతమార్చాడు. 8లో ▸



వాహనదారుల యాతన

అధికారుల నిర్లక్ష్యం కారణంగా వంతెనలపై ఊడిన రేలింగ్ మరమ్మతులకు నోచుకోవడం లేదు. 9లో ▸

న్యూస్‌రీల్

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

బంట్వారం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కే రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం కోట్‌పల్లి మండల కేంద్రంలో పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. పంచాయతీ, ఎంపీటీసీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా మెజార్టీ స్థానాలు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. కార్యకర్తలే పార్టీకి బలం బలగం అన్నారు. బూత్ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రధాని మోదీ పాలనపై ప్రజలు ఎంతో విశ్వాసంతో ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శివకుమార్, నాయకులు కృష్ణాయాదవ్, ఓగుల్లాపూర్ రాజు, రవి, నరేందర్‌రెడ్డి, చారీ, జగదీశ్వర్, శ్రీశైలం, బాల్‌రాజ్, రాజు, వెంకట్‌రెడ్డి, శేఖర్, కిరణ్,నవాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సన్నబియ్యం

పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి



ఇందనూర్‌లో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న గురునాథ్‌రెడ్డి

కొడంగల్: ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి పేదలందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కస్తూరుపల్లి, ఇందనూర్, రావులపల్లి గ్రామాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి సన్న బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి సన్న బియ్యం ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రేషన్ డీలర్లు సమయపాలన పాటించి కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ సకాలంలో బియ్యం సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ విజయ్‌కుమార్,లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ఠ, మాజీ సర్పంచులు బాల్‌రెడ్డి, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో ఉంచొద్దు

కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో ఉంచరాదని, సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 120 అర్జీలు స్వీకరించారు. వాటిలో ధరణికి సంబంధించిన భూ సమస్యలు, ఆసరా పెన్షన్లు, ఇరిగేషన్ తదితరల సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఫార్మా భూముల సర్వే

యాచారం: ఫార్మాసిటీ భూముల సర్వే సోమవారం ప్రశాంతంగా జరిగింది. యాచారం-కడ్తాల్ మండలాల సరిహద్దులోని నక్కర్తమేడిపల్లి, పల్లెచల్కతండా, నానక్‌నగర్‌లో యాచారం తహసీల్దార్ అయ్యప్ప ఆధ్వర్యంలో 20 మందికి పైగా టీజీఐఐసీ, రెవెన్యూ, సర్వే అధికారులు ఫార్మాసిటీకి సేకరించిన అసైన్డ్, పట్టా భూములను సర్వే చేశారు. ముందు జాగ్రత్త చర్యగా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నక్కర్తమేడిపల్లి- పల్లెచల్కతండా రోడ్డుపై రాకపోకలు సాగించే కార్లు, బైక్‌లు, ఇతర వాహనాలను తనిఖీ చేశారు. ఏ గ్రామం..ఎక్కడికి వెళ్తున్నారు.. అంటూ ఆరా తీశారు. నక్కర్తమేడిపల్లి, పల్లెచల్కతండా, నానక్‌నగర్ గ్రామాల్లో ఆందోళనకారులపై నిఘా పెట్టారు.

కొడంగల్ అభివృద్ధిలో తగ్గేదేలే!



కొడంగల్‌లో చురుగ్గా సాగుతున్న ఆస్పత్రి భవన నిర్మాణం

సీఎం ప్రత్యేక చొరవతో శరవేగంగా కొనసాగుతున్న పనులు

- చురుగ్గా 220 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం
- తుదిదశకు మున్సిపల్ కార్యాలయం
- పిల్లర్ స్థాయిలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం
- పారిశ్రామికవాడ దిశగా అడుగులు

కొడంగల్: సమీప భవిష్యత్‌లో కొడంగల్ రూపురేఖలు మారిపోనున్నాయి.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నియోజకవర్గ అభివృద్ధికి నిధుల వరద పారిన విషయం తెలిసిందే.. ప్రస్తుతం అభివృద్ధి పనులు భూమిపూజ దాటి కార్యరూపం దాల్చాయి. నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు సీఎం కృతనిశ్చయంతో ఉన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, వ్యవసాయం, పరిశ్రమల ఏర్పాట్లుపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల, వృత్తి విద్యా కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, మహిళా డిగ్రీ కళాశాల, పీజీ కళాశాల, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు నూతన భవనాలు నిర్మించనున్నారు. భవన నిర్మాణాలకు ఒక్కో మండలానికి రూ.7.13 కోట్ల చొప్పున రెండు మండలాలకు కలిపి రూ.14.26 కోట్లు మంజూరు చేశారు. దుద్యాల్ మండలంలో పారిశ్రామిక వాడ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఇలా ఒకటేమిటి రూ.వేల కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు.

పారిశ్రామికం వైపు అడుగులు

నియోజవకర్గ పరిధిలోని దుద్యాల్ మండలం పోలేపల్లి, హకీంపేట, లగచర్ల గ్రామాల శివారులో సుమారు 1,200 ఎకరాల్లో పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే భూ సేకరణ ప్రక్రియ దాదాపు పూర్తికా వచ్చింది. రైతులకు పరిహారం చెల్లిస్తున్నారు.

నిధుల మంజూరు ఇలా..

కొడంగల్ మండలం ఎరన్‌పల్లి శివారులో ప్రభుత్వ మెడికల్ కళాశాలను నిర్మించనున్నారు. భవన నిర్మాణం, మౌలిక వసతుల కోసం రూ.124.50 కోట్లు మంజూరు చేశారు. ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణం, మౌలిక సదుపాయాల కోసం రూ.46 కోట్లు విడుదల చేశారు.ప్రభుత్వ ఫిజియోథెరపీ కళాశాల, పారామెడికల్ కళాశాల నిర్మాణం కోసం రూ.27 కోట్లు మంజూరయ్యాయి. కొడంగల్ పట్టణంలో 220 బెడ్ల ప్రభుత్వ టీచింగ్ ఆస్పత్రిని నిర్మాణానికి రూ.27 కోట్లు కేటాయించారు. కోస్గిలో ఇంజనీరింగ్ కళాశాల కోసం రూ.30 కోట్లు, మహిళా డిగ్రీ కళాశాల, మౌలిక వసతుల కల్పనకు రూ.11 కోట్లు మంజూరు చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ, మైనార్టీ వెల్ఫేర్ గురుకులాలకు అధునాతన వసతులతో కొత్త భవనాల నిర్మాణం కోసం ఒక్కోదానికి రూ.20 కోట్లు మంజూరయ్యాయి. కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకానికి ముందుగా రూ.2,945 కోట్లు మంజూరు చేశారు. తర్వాత పథకం సామర్థ్యం పెంచి నిధుల ను రెట్టింపు చేశారు. కొడంగల్‌లో ఆర్‌అండ్‌బీ అతి థి గృహం నిర్మించడానికి రూ.6 కోట్లు విడుదలయ్యాయి. ప్రస్తుతం ఈ పనులు పిల్లర్‌స్థాయిలో ఉన్నాయి. నియోజకవర్గంలో రోడ్ల విస్తరణకు రూ.344 కోట్లు, పలు పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.30 కోట్లు మంజూరు చేశారు.

ఏడాదిలోపు పనులు పూర్తయ్యేలా..

నియోజకవర్గంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఏడాదిలోపు పూర్తయ్యేలా అధికారులు కసరత్తు చేస్తున్నారు.. కొడంగల్ పట్టణంలో చేపట్టిన 220ల పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మున్సిపల్ కార్యాలయ నూతన భవన నిర్మాణం తుది దశకు చేరుకోగా.. ఆర్‌అండ్‌బీ అతిథి గృహ నిర్మాణ పనులు పిల్లర్ దశలో ఉన్నాయి. ఇవి కాకుండా సమీకృత గురుకులాలు, మెడికల్ కళాశాల, వృత్తి విద్యా కళాశాల, ఇంజనీరింగ్ కళాశాల, నర్సింగ్ కళాశాల, ఫిజియోథెరపీ కళాశాల, పారా మెడికల్ కళాశాల, స్కిల్ యూనివర్సిటీ, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, మహిళా డిగ్రీ కళాశాల, పీజీ కళాశాల భవన నిర్మాణాల పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

అంతర్జాతీయ ప్రమాణాలతో..



తుది దశకు మున్సిపల్ కార్యాలయం

కొడంగల్‌లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్స్‌కు పాత కొడంగల్ శివారులో 20 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాంచారు. రూ.100 కోట్లతో గురుకులాలను నిర్మించనున్నారు. 4నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ఉచిత వసతితో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తారు. అలాగే క్రీడలను ప్రోత్సహించేలా క్రికెట్, ఫుట్‌బాల్ గ్రౌండ్స్‌తో పాటు బాస్కెట్ బాల్, టెన్నిస్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు. ఇదిలా ఉండగా నియోజకవర్గానికి ఆయూష్ మెడికల్ కళాశాలను మంజూరు చేయాలని విద్యావంతులు కోరుతున్నారు. ఈ ప్రాంతానికి చెందిన వేలాది మంది విద్యార్థులు కర్ణాటక రాష్ట్రానికి వెళ్లి బీఏఎంఎస్, బీహెచ్‌ఎంఎస్ వైద్య విద్యను అభ్యసిస్తున్నారు. ఈ ప్రాంతలో ఆయూష్ కళాశాలను ఏర్పాటు చేస్తే ఇక్కడి విద్యార్థులకు మేలు జరిగే అవకాశం ఉంది.

ధాన్యం సేకరణకు పకడ్బందీ చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్

అనంతగిరి: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం సేకరణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15నుంచి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. తేమ లేని వడ్లను మిల్లులకు తెచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 128 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. 11 కేంద్రాలు సన్న రకం వడ్ల కోసం, 117 దొడ్డు రకాలు కొనుగోలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సుమారు 1,90,000 మెట్రిక్ టన్నుల దొడ్డు రకం వరి, 10,000 మెట్రిక్ టన్నుల సన్న రకం వరి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. ఐకేపీ కేంద్రాల్లో ధ్యానం కొనుగోలుకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి కేంద్రం వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ధరలు, తేమ శాతం తదితర వివరాలు పొందుపరచాలని ఆదేశించారు. కేంద్రాల్లో తేమ శాతం కొలిచే పరికరాలు, గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు, తూకం యంత్రాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. రైతులకు తాగు నీటి వసతి ఉండేలా చూసుకోవాలన్నారు. చెక్ పోస్టుల వద్ద రెవెన్యూ, పోలీస్, సివిల్ సప్లయ్ సిబ్బందిని నియమించి పొరుగు రాష్ట్రాల నుంచి వడ్లు రాకుండా చూడాలన్నారు. ముందుగా రైతులకు టోకెన్లు ఇచ్చి ఏ రోజు ధాన్యం తేవాలో చెప్పాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేందుకు లారీలను సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం రైస్ మిల్లర్లతో సమావేశమయ్యారు. నాణ్యమైన సీఎంఆర్ రైస్‌ను అందజేయాలని మిల్లర్లకు సూచించారు. 2023-24 సంవత్సరం రబీకి సంబంధించిన బియ్యాన్ని కూడా వెంటనే అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎస్ఓ మోహన్‌బాబు, సివిల్ సప్లయ్ డీఎం వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి సారంగపాణి, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తా, బాలేశ్వర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

- చిలుకూరు బాలాజీ దేవాలయంలో ప్రత్యేక పూజలు
- పుట్ట మన్నుతెచ్చి హోమగుండాల ఏర్పాటు
- విశ్వక్సేనుడి ఆరాధనతో ఉత్సవాలను ప్రారంభించిన అర్చకులు

మొయినాబాద్: కలియుగదైవం.. చిలుకూరు బాలాజీ స్వామివారి బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి ప్రారంభమయ్యాయి. వారం రోజులపాటు కొనసాగే బ్రహ్మోత్సవాలకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి అంకురార్పణ చేశారు. ఆలయ ప్రధాన మండపంలో స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి బ్రహ్మోత్సవాల పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. మొదట సెల్వర్ కూత్తు.. వేద మంత్రోచ్ఛరణతో దేవాలయాన్ని శుద్ధి చేశారు. అనంతరం పుట్ట బంగారం (పుట్టమన్ను) తీసుకొచ్చి హోమగుండాలు ఏర్పాటు చేశారు. అందులో నవధాన్యాలు, పాలికలు కలిపి హోమాలను వెలిగించారు. తరువాత విశ్వక్సేనుడి ఆరాధన, పుణ్యాహవచన కార్యక్రమాలు చేపట్టారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను ఆలయ ప్రాంగణంలో ఊరేగించిన అనంతరం యజ్ఞం చేపట్టారు. రాత్రి 7గంటలకు ప్రారంభమైన కార్యక్రమాలు అర్ధరాత్రి వరకు సాగాయి. పూజా కార్యక్రమాలు కిరణాచారి, రామస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాల కృష్ణస్వామి, అర్చకులు రంగరాజన్, నరసింహన్, కన్నయ్య, కిట్టు, మురళి, కృష్ణమూర్తి, అనిల్ పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు చేసి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

నేడు ధ్వజారోహణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండోరోజు ధ్వజారోహణం, శేషవాహనం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ధ్వజారోహణం సందర్భంగా గరుత్మంతునికి ప్రత్యేక పూజలు నిర్వహించి ధ్వజస్తంభానికి గరుడ పతాన్ని ఆరోహణం చేస్తారు. ఈసారి గరుడ ప్రసాదం పంపిణీ ఉండదని.. ఈ విషయాన్ని భక్తులు గమనించాలని ఆలయ అర్చకుడు రంగరాజన్ స్పష్టం చేశారు.

ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి

క్రయవిక్రయాలపై రుసుం చెల్లించాలంటున్న మున్సిపల్ అధికారులు

తాండూరు టౌన్: మున్సిపల్ అధికారులు ఆదాయ వనరులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇకపై మున్సిపల్ పరిధిలో ఎలాంటి క్రయవిక్రయాలు జరిగినా రుసుం చెల్లించాల్సిందేనని హుకుం జారీ చేశారు. ఇందులో భాగంగా పట్టణంలో ఏళ్ల తరబడిగా మూతపడిన తైబజార్ వసూళ్లకు తిరిగి రంగం సిద్ధం చేసుకున్నారు. ఇటీవలే తైబజార్ బహిరంగ వేలం వేయడంతో ఓ కాంట్రాక్టర్ రూ.10,25,100కు వేలం దక్కించుకున్నారు. దీంతో ఇక పట్టణంలోని ఏవార్డులో అయినా రోడ్డు పక్కన చిన్న దుకాణం పెట్టి విక్రయాలు జరిపినా రుసుం చెల్లించాల్సి ఉంటుందని మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి తెలిపారు. ఈ నెల 1నుంచి ఇది అమల్లోకి వచ్చినట్లు చెప్పారు. కూరగాయల దుకాణం, బట్టల విక్రయం, ఐస్‌క్రీం బండి, చేపలు రూ. 40, ట్రాలీ ఆటోపై సరుకులు రూ. 70, టిఫిన్ బండి, కొబ్బరి బోండాలు, కుండలకు రూ. 50, టీస్టాల్, బజ్జీల బండి, కూల్‌డ్రింక్స్, పూలు, అరటి పండ్లు రూ.30, సోడా బండి రూ. 20లతో పాటు ఇతరాలకు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. అయితే కూరగాయల మార్కెట్‌లో లోకల్ లారీలు, టెంపో వంటి వాహనాల నుంచి, నెత్తిమీద గంప పెట్టుకుని అమ్మే వారి నుంచి తైబజార్ వసూళ్లు ఉండవని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. అయితే ఇన్నేళ్లు లేని తైబజార్ తిరిగి అమల్లోకి తీసుకురావడం పట్ల రోడ్ల పక్కన విక్రయాలు నిర్వహించే చిరు వ్యాపారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రాజ్యాధికారంతోనే అభివృద్ధి సాధ్యం

షాద్‌నగర్: బీసీలు రాజ్యాధికారాన్ని సాధించినప్పుడే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్ అన్నారు. పట్టణంలోని బీసీసేన నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు బాసవరలక్ష్మి స్వగృహంలో సోమవారం నియోజకవర్గ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖరప్ప ఆధ్వర్యంలో బీసీసేన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీసేన జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుధాకర్, ఫరూఖ్‌నగర్ మండల మహిళా అధ్యక్షురాలిగా జలజ, పట్టణ అధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మిగౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం బర్క కృష్ణయాదవ్ మాట్లాడుతూ.. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రావాల్సిన హక్కు లు, రిజర్వేషన్లను కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నాయని విమర్శించారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయే తప్ప వారి కష్టాలు పట్టించుకోవడంలేదని దుయ్యబట్టారు. అనంతరం నూతనంగా నియమితులైన వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శివ, నరేష్, భూషణ్, నరేష్, చందులాల్, వరకుమార్ పాల్గొన్నారు.

ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

యాచారం: బీఆర్ఎస్ సర్కార్ నాడు ఫార్మాసిటీ పేరుతో భూసేకరణ చేస్తే అధికారంలోకి వస్తే తిరిగి భూములు ఇస్తామని మాటిచ్చిన కాంగ్రెస్ పార్టీ కూడా నేడు రైతులను మోసం చేస్తోందని ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నేతలు పేర్కొన్నారు. ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నక్కర్తమేడిపల్లిలో నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాలకు చెందిన రైతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రైతులను మోసం చేసిందని, కోర్టు ఉత్తర్వులను అధికారులైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కొలత.. కలత!

భూ తగాదాలు తీరాలన్నా.. గట్టు పంచాయతీలు వచ్చినా భూ సర్వే చేసి పరిష్కరిస్తారు. కాగా జిల్లా వ్యాప్తంగా సర్వేయర్ల కొరత ఉండడంతో సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. సర్వేకు దరఖాస్తు చేసుకున్న బాధితులు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

దౌల్తాబాద్: భూముల హద్దులు, విస్తీర్ణంలో వ్యత్యాసాలు తేల్చేందుకు భూములు సర్వే చేస్తారు. కాగా జిల్లాలో సర్వేయర్ పోస్టులు భర్తీ చేయకపోవడంతో రైతులకు సకాలంలో సేవలు అందడంలేదు. జిల్లాలోని 20 మండలాలకుగాను పది మంది సర్వేయర్లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. మరోవైపు ధరణి వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చిన తర్వాత భూవివాదాలు మరింతగా పెరిగిపోయాయి. సర్వే చేసి భూసమస్యలను పరిష్కరించాలంటూ రైతులు దరఖాస్తులు చేసుకుంటున్నారు. సర్వేయర్ల కొరతతో అవి పరిష్కారానికి నోచుకోవడంలేదు. ప్రస్తుతం జిల్లాలలో 2,500 రైతులకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

గడువు నిబంధన గాలికి

భూ సర్వే కోసం రైతులు దరఖాస్తు చేసుకున్న మూడు నెలల్లో సమస్యను పరిష్కరించాల్సి ఉంటుంది. సర్వేయర్లు రికార్డుల ఆధారంగా సర్వే చేసి హద్దులు, విస్తీర్ణం తేల్చాలి. కానీ జిల్లాలో సర్వేయర్లు లేకపోవడంతో నెలలు గడుస్తున్నా దరఖాస్తులకు మోక్షం లభించడంలేదు. సమస్య పరిష్కారించాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ సర్వేయర్లతో పనులు చేయించుకోవాలని సూచిస్తున్నారని దీంతో ప్రైవేట్ వ్యక్తులతో సర్వే చేయించుకుంటున్నామని రైతులు వాపోతున్నారు.



భూమి సర్వే చేయించుకుంటున్న రైతులు(ఫైల్)

గొలుసుల స్థానంలో జీపీఎస్ సర్వే

గతంలో గొలుసు పద్ధతిలో భూములను కొలిచేవారు. ప్రస్తుతం జీపీఎస్ పరికరంతో కొలతలు వేస్తున్నారు. ఈ పరికరానికి రూ.15 నుంచి రూ.20వేల వరకు ఖర్చవుతోంది. ప్రభుత్వం పరికరాలను సమకూర్చకపోవడంతో సర్వేయర్లే సొంతంగా కొనుగోలు చేసుకుంటున్నారు.

భూముల సర్వేకు అనేక ఇబ్బందులు

- వేధిస్తున్న సర్వేయర్ల కొరత
- 20 మండలాలకు ఉన్నది పది మంది మాత్రమే
- పెండింగ్‌లో 2,500 దరఖాస్తులు
- పరిష్కారానికి నోచుకోని భూసమస్యలు
- కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

అడిగినంత ఇస్తేనే..

ధరణి పోర్టల్‌లో చిన్నపాటి సాంకేతిక సమస్యతో ఆన్‌లైన్‌లో భూములు కనిపించక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే అదనుగా సర్వేయర్లు వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలిసింది. నెలల తరబడి తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో రైతులు విసిగిపోయి సర్వేయర్లు అడిగినంత ఇచ్చి సర్వే చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. ఈ విషయం అధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాం

జిల్లాలో 10 మంది సర్వేయర్లు ఉన్నారు. సిబ్బంది కొరతతో సర్వేలు ఆలస్యం జరుగుతోంది. ఈ విషయమై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక అందించాం. త్వరలో దరఖాస్తులు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

– మధురాంరెడ్డి, ఏడీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, వికారాబాద్

క్లుప్తంగా

సంఘాలు ఐక్యంగా కొనసాగాలి

పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



ఆర్యవైశ్య సంఘం వార్షికోత్సవంలో మాజీ ఎమ్మెల్యే తదితరులు

పరిగి: సంఘాలు సంఘటితంగా ఉంటేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన పట్టణ కేంద్రంలో నిర్వహించిన పరిగి ఆర్యవైశ్య సంఘం వార్షికోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంఘాలు పార్టీలకు అతీతంగా పనిచేయాలన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్యవైశ్య సంఘానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులను కేటాయించి వారి అభ్యున్నతికి కృషి చేసిందన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు మధుసూదన్, మాజీ కౌన్సిలర్లు కిరణ్, కృష్ణ, రమేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ

- ఒకరి దుర్మరణం, భార్యాభర్తలకు గాయాలు
- కేసు నమోదు చేసిన పోలీసులు



శ్రీనివాస్ (ఫైల్)

ధారూరు: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఒకరు దుర్మరణం పాలవగా భార్యాభర్తలకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని ఎబ్బనూర్ చెరువు సమీప రోడ్డుపై ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. ధారూరు ఎస్‌ఐ అనిత తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రుద్రారానికి చెందిన కంది శ్రీనివాస్(28) పని నిమిత్తం తన పల్సర్ బైక్‌పై వికారాబాద్ బయలుదేరాడు. గట్టెపల్లికి చెందిన నర్సింలు తన భార్య లక్ష్మితో కలిసి బైక్‌పై వికారాబాద్ నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఎబ్బనూర్ చెరువు సమీపంలోకి రాగానే రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. గాయపడ్డ వారిని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. శ్రీనివాస్ పరిస్థితి విషమంగా ఉండటంతో అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మనస్తాపంతో వ్యక్తి బలవన్మరణం



మల్కప్ప మృతదేహం

బొంరాస్‌పేట: కుటుంబ పరిస్థితుల కారణంగా ఓ వ్యక్తి మనస్తాపం చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం మండల పరిధిలోని ఎన్కేపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవూఫ్ తెలిపిన ప్రకారం.. కొడంగల్ పట్టణానికి చెందిన పల్లగేరి మల్కప్ప(35)కు పన్నెండేళ్ల క్రితం ఎన్కేపల్లికి చెందిన గొటికె రాములప్ప కూతురు నర్సమ్మతో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు సంతానం. మల్కప్పకు తల్లిదండ్రులు లేకపోవడం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా కుటుంబపోషణ సైతం భారంగా ఉందని మదనపడుతున్నాడు. తాజాగా తన భార్య పుట్టింటికి వెళ్లడంతో సోమవారం ఎన్కేపల్లికి వచ్చిన ఆయన కొడంగల్‌కు వెళ్దామని కోరాడు. దీంతో ఆయన మామ రాములు ముందుగా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. దీంతో మనస్తాపానికి గురైన మల్కప్ప ఎన్కేపల్లి శివారులో పప్పురేగడి వద్ద దోమలవంపు ప్రాంతంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాను మనస్తాపంతో చనిపోతున్నానంటూ మృతుడు మల్కప్ప ముందుగా తన కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేవని.. దీంతో ఆత్మహత్య చేసుకుంటున్నానని పెట్టిన వాయిస్ మెసేజ్ వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ అయింది. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని.. మృతదేహాన్ని కొడంగల్ ప్రభుత్వాస్పత్రికి తరలించామని పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు?

కుల్కచర్ల: మండల పరిధిలోని ఇప్పాయిపల్లిలో జరిగిన చైన్ స్నాచింగ్ కేసు విచారణ వేగవంతమైంది. గ్రామానికి చెందిన నర్సమ్మ మెడలోంచి ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటనలో బాధితురాలి మెడకు గాయాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్న విషయం తెలిసిందే. కేసు విచారణ భాగంగా రంగంలోకి దిగి ప్రత్యేక బృందాలు సోమవారం తిర్మలాపూర్‌కు చెందిన ఒకరు, ఇప్పాయిపల్లికి చెందిన ఇద్దరు అనుమానితుల్ని అదుపులో కి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. అయితే చైన్ స్నాచింగ్ ఘటన యాదృచ్ఛికంగా జరిగిందా..? ఉద్దేశ పూర్వకంగా దాడి చేశారా..? అనేది బాధితురాలు తేరుకుంటేనే తెలుస్తుంది.

అగ్నికి ఆహుతైన బ్లాక్ ప్లాంటేషన్

మొక్కలకు నిప్పటించిన దుండగులు

- కాలిబూడిదైన ఎనిమిది వేల మొక్కలు
- అధికారుల నిర్లక్ష్యమేనని గ్రామస్తుల ఆగ్రహం



సాక్షి

మొక్కలు నాటారు.. సంరక్షణ మరిచారు

సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనం



ఆదివారం రాత్రి బ్లాక్ ప్లాంటేషన్‌లో ఎగిసిపడుతున్న మంటలు

నవాబుపేట: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారుతోంది. ఇందుకు 8 వేల మొక్కల దహనం నిలువెత్తు నిదర్శనం. ప్రతీ ఏడాది వర్షాకాలంలో నాటుతున్న మొక్కలు వేసవిలో అగ్నికి ఆహుతవుతున్నాయి. అయినప్పటికీ అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రెండేళ్ల వరకు మెయింటనెన్స్

మండల పరిధిలోని నారెగూడ గ్రామంలోని సర్వే నెంబర్ 153లో సుమారు 15 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలో నాలుగేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం మొక్కలు పెంచాలని నిర్ణయించింది. పంచాయతీరాజ్, ఉపాధిహామీ పథకంలో భాగంగా బ్లాక్ ప్లాంటేషన్ పేరుతో కానుగ, జామ, గుల్మార్ తదితర మొక్కలను 8 వేలకు పైగా నాటారు. రెండేళ్ల వరకు ఉపాధి హామీ పథకంలో మొక్కల సంరక్షణకు మెయింటనెన్స్ డబ్బులు ఇచ్చారు. తదనంతరం ఉపాధి హామీ నుంచి మెయింటనెన్స్ నిలిచిపోవడంతో గ్రామపంచాయతీ నుంచి ఇచ్చి మొక్కలకు నీళ్లు పోయడం, పిచ్చి మొక్కలు తొలగించడం, గడ్డిని తొలగించడం తదితర పనులు చేపట్టారు.

పట్టించుకునే వారు కరువు

సర్పంచ్‌ల పదవీకాలం అనంతరం గ్రామపంచాయతీ అధికారులు, ఉపాధిహామీ సిబ్బంది ఈ బ్లాక్ ప్లాంటేషన్‌ను పట్టించుకోవడం మానేశారు. దీంతో పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగింది. అధిక ఉష్ణోగ్రతల కారణంగా అవి ఎండిపోయాయి. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు చేసిన పనుల కారణంగా మొక్కలన్నీ అగ్నికి ఆహుతయ్యాయి.



కాలిబూడిద అయిన మొక్కలు

ముందే హెచ్చరించిన 'సాక్షి'

మండలంలో ప్రతీ వేసవిలో మొక్కలు కాలిపోతున్నాయని, మొక్కల చుట్టూ పెరిగిన గడ్డిని తొలగించాలని ఇటీవలే 'సాక్షి' దినపత్రికలో 'మొక్కలు నాటారు.. సంరక్షణ మరిచారు' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. అధికారులు స్పందించి ఎండు గడ్డిని తొలగించి ఉంటే ప్రమాదం జరిగేది కాదని స్థానికులు చర్చించుకున్నారు.

కష్టానికి ఫలితం బూడిద



తాను సర్పంచ్‌గా ఉన్న సమయంలో ఈ ప్లాంటేషన్ ఏర్పాటు చేశాం. మూడేళ్లు కష్టపడి ఆ మొక్కలను పెంచి పెద్ద చేశాం. అధికారుల నిర్లక్ష్యంతో ఈ రోజు మొక్కలన్నీ కాలిబూడిదయ్యాయి. మొక్కల మధ్య ఎండిన గడ్డిని తొలగించి ఉంటే ఈ ప్రమాదం సంభవించేది కాదు.

– పర్మయ్య, మాజీ సర్పంచ్, నారెగూడ

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



బ్లాక్ ప్లాంటేషన్‌లో మొక్కలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పటించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మొక్కలన్నీ కాలిపోయాయి. నీళ్లు పోస్తే పెద్ద మొక్కలు బ్రతికే అవకాశం ఉంది. నీరు పోసి ఆ మొక్కలను కాపాడుతాం.

– శోభ, పంచాయతీ కార్యదర్శి, నారెగూడ

తాగునీటి సమస్యకు పరిష్కారం

సాక్షి ఎఫెక్ట్..

దోమ: భానుడి తాపానికి గ్రామాల్లో తాగునీటి సమస్యలు తీవ్రమవుతున్నాయి. కొన్ని రోజులుగా మండల పరిధిలోని ఊటుపల్లి తండాలో నీటి సమస్య తీవ్రమై తండా వాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం «సాక్షి» దిన పత్రికలో పండగ పూటా.. «నీటి కోసం వేట» అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు గ్రామాన్ని సందర్శించారు. తండా వాసులను అడిగి సమస్యను తెలుసుకుని వెంటనే నీరందేలా చర్యలు తీసుకున్నారు. గ్రామంలో ఒకే బోరు ఉండడంతో సమస్య తలెత్తిందని.. మిషన్ భగీరథ నీటి సరఫరా కాకపోవడంతో సమస్య తీవ్రమైందని ఇన్‌చార్జి ఎంపీఓ రాజేశ్ తెలిపారు. గ్రామానికి ఎస్డీఎఫ్ కింద బోరు మంజూరైందని.. ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని వీలైనంత త్వరగా బోరు వేయించి సమస్యను అధిగమిస్తామన్నారు. మిషన్ భగీరథ నీరందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మిషన్ భగీరథ నీరు రాని పక్షంలో ట్యాంకర్ ద్వారా తాగు నీరు సరఫరా చేయాలని పంచాయతీ కార్యదర్శికి సూచించామన్నారు.



ఊటుపల్లితండాలో పర్యటిస్తున్న ఇన్‌చార్జి ఎంపీఓ రాజేశ్

కుల వివక్షపై ప్రత్యక్ష పోరాటం

- ఏప్రిల్ 11 నుంచి 14 వరకు గ్రామ సభలు
- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్కయ్య

బషీరాబాద్: ఆధునిక సమాజంలోనూ మితిమీరుతున్న కులవివక్షపై పోరాటానికి దళిత వర్గాలు సిద్ధమవ్వాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పలి మల్కయ్య పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో అంబేడ్కర్ చౌరస్తాలో దళిత సంఘాలతో కలిసి పూలే, అంబేడ్కర్ జనజాతర కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్కయ్య మాట్లాడుతూ.. దేశంలో కులవివక్ష పెరిగిపోతుందన్నారు. భారత రాజ్యాంగంలోని 14, 15 ఆర్టికల్స్ కులవివక్ష, అంటరానితనాన్ని నిషేధించాయని గుర్తు చేశారు. రాజ్యాంగాన్ని అమలు చేసే పాలకులు అమానుష ఘటనలను నిరోధించడంలో విఫలమవుతున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో దళితులపై దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు, హత్యలు, సాంఘిక బహిష్కరణలు నిత్యకృత్యమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సంపూర్ణ కులవివక్ష కోసం ప్రజా సంఘాలు, దళిత మేధావులతో కలిసి ప్రత్యక్ష పోరాటానికి సిద్ధమవుతున్నట్లు చెప్పారు. ఏప్రిల్ 11 పూలే జయంతి మొదలు అంబేడ్కర్ జయంతి ఏప్రిల్ 14 వరకు గ్రామ సభలు నిర్వహించి దళిత వర్గాలను సంఘటితం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు సంజీవ్ కుమార్, కమలకుమార్, ఎడ్ల సురేశ్, శ్యామప్ప, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

యువకుడు అదృశ్యం

కేశంపేట: మెడికల్ షాప్‌లో పనిచేసే వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండల పరిధిలోని కొత్తపేటలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ రాజ్‌కుమార్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన రొయ్యల రాకేశ్ స్థానికంగా ఓ మెడికల్ షాప్‌లో పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం మధ్యాహ్న భోజనానికి వచ్చిన ఆయన తిరిగి పనికి వెళ్లలేదు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో అతడి ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో రాకేష్ తల్లి యాదమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తులో ఉంది.



రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న నేతలు

రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

కుల్కచర్ల: రాజ్యాంగ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని బండివెల్కిచర్ల, బొంరెడ్డిపల్లి, కుల్కచర్ల గ్రామాల్లో జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సబ్బండ వర్గాల ఉన్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని.. ఇతర పార్టీల నేతలు భారత రాజ్యాంగాన్ని మార్చేందుకు అంబేడ్కర్ వాదాన్ని అవమానపరుస్తున్నారని అన్నారు. భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలనే ఉద్దేశంతో రాహుల్ గాంధీ ఆదేశాలతో దేశ వ్యాప్తంగా జైబాపు, జైభీం, జైసంవిధాన్ కార్యక్రమాన్ని ప్రతీ పల్లెకు తీసుకువెళ్లాలన్న సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకుసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ అంజనేయులుముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్ కుమార్, మాజీ ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, యువజన విభాగం అధ్యక్షుడు జంగయ్యముదిరాజ్, మార్కెట్ కమిటీ డైరక్టర్ భరత్‌కుమార్ రెడ్డి, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పెంటమీది వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్ రెడ్డి, జిల్లా నాయకులు రాఘవన్ నాయక్, వెంకటయ్య, మహేష్ ముదిరాజ్, కృష్ణయ్య, బాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

దోమ: విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నతంగా ఎదగాలని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని దాదాపూర్ పాఠశాల పీఎం శ్రీ కింద ఎంపికవడంతో హెచ్‌ఎం డి.అమర్‌నాథ్ పాఠశాల వార్షికోత్సవం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తోందన్నారు. ప్రతీ విద్యార్థి శ్రద్ధతో చదువుకుని ఉపాధ్యాయులు, తల్లితండ్రుల పేరు నిలబెట్టాలన్నారు. అనంతరం హెచ్‌ఎం అమర్‌నాథ్ జూనియర్ కళాశాలతో పాటు హాస్టల్ వసతి కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. పాఠశాలలో తరగతి గదులు తక్కువగా ఉన్నాయని, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ లేదని అదనపు గదులు నిర్మించాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్‌రెడ్డి, ఎంఈఓ వెంకట్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లాల్యానాయక్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కేశవులు, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ సింగ్, ఉపాధ్యాయులు గోపాల్, వీరప్ప, ప్రభాకర్ రెడ్డి, సతీష్, సాయిలు, భీమ్యా, కృష్ణయ్య, రాములు, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

అల్లుడే హంతకుడు

భార్యను పంపించడం లేదని కక్ష పెంచుకున్న నిందితుడు

- ఆక్రోశంతో మామపై గొడ్డలితో దాడి
- కేసు వివరాలను వెల్లడించిన సీఐ శ్రీనివాస్‌రెడ్డి



మొగులయ్య హత్య వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి

దోమ: పుట్టింటికి వెళ్లిన భార్యను తిరిగి పంపించకపోవడంతో మామపై కక్ష పెంచుకుని, హత్య చేసినట్లు నిందితుడు ఎడ్ల మల్లేశ్ అంగీకరించాడని పరిగి సీఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం అర్ధరాత్రి నిద్రిస్తున్న మొగులయ్యను గొడ్డలితో నరికి చంపిన విషయం విదితమే. ఈ హత్య మిస్టరీకి సంబంధించిన వివరాలను పరిగి సీఐ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎస్‌ఐ నాగేందర్ వెల్లడించారు. మండల పరిధిలోని ఖమ్మం నాచారం గ్రామానికి చెందిన మొగులయ్య(58)ను తన అల్లుడు మోత్కూర్ గ్రామానికి చెందిన ఎడ్ల మల్లేశ్ చంపి ఉంటాడని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు మల్లేశ్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్న మల్లేశ్‌కు.. భార్య ఇద్దరు పిల్లలు. మల్లేశ్ తరుచూ భార్యతో గొడవ పడుతుండగా ఆమె తల్లిగారింటికి వచ్చింది. దీంతో మొగులయ్య కుటుంబ సభ్యులు ఇరువురికి సర్దిచెప్పి తిరిగి పంపించారు. మరోమారు భార్యతో మల్లేశ్ గొడవ పడడంతో మొగులయ్య కూతురును తీసుకువచ్చి తన వ్యవసాయ క్షేత్రం వద్దే ఉంచుకున్నాడు. అప్పటి నుంచి తన భార్యను పంపించడం లేదనే ఆక్రోశంతో మామాపై మూడు నెలలుగా కక్ష పెంచుకున్నాడు. ఎలాగైనా మామను మట్టుబెడితే భార్యను తనతో తీసుకువెళ్లవచ్చనే ఉద్దేశంతో పథకం ప్రకారం ఈ నెల 5న శనివారం అర్ధరాత్రి వ్యవసాయ క్షేత్రంలో నిద్రిస్తున్న మొగులయ్యను తల, ముఖంపై గొడ్డలితో అతి కిరాతకంగా నరికి చంపాడు. గొడ్డలిని దారి మధ్యలో ఉన్న పొదల్లో పడేసి ఇంటికి చేరుకున్నాడని సీఐ తెలిపారు. గొడ్డలిని స్వాధీనం చేసుకుని నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా కోర్టు రిమాండ్ విధించిందని సీఐ శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



చిన్నస్వామి (ఫైల్)

కుల్కచర్ల: విద్యుదాఘాతంతో కౌలు మృతిచెందిన సంఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాంరెడ్డిపల్లికి చెందిన కుమ్మరి చిన్నస్వామి(74) తన పొలంతో పాటు ముజాహిద్‌పూర్ గ్రామంలో మరింకొంత పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో ఆదివారం రాత్రి పొలం వద్దకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి భార్య పార్వతమ్మ విషయాన్ని కొడుకు వెంకటేశ్‌కు చెప్పింది. దీంతో చేను వద్దకు వెళ్లి చూడగా.. స్టార్టర్ డబ్బా వద్ద వరి పొలంలో పడిపోయి మృతిచెందాడు. బల్బ్ వెలిగించేందుకు తీగలు పెట్టే క్రమంలో విద్యుదాఘాతానికి గురైనట్లు భావిస్తున్నారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకుని ధైర్యం చెప్పారు. అంత్యక్రియల కోసం ఆర్థిక సాయం అందజేశారు.

బాటకు అడ్డంగా కంపవేశారని కేసు

కొందుర్గు: బాటకు అడ్డంగా కంపచెట్లు వేశారని నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రవీందర్‌నాయక్ తెలిపిన ప్రకారం.. టేకులపల్లి గ్రామానికి చెందిన బేగరి రాజు, మహేష్, లక్ష్మయ్య, పాండు ఈ నెల 5న గ్రామం నుంచి ఉత్తరాసిపల్లి మార్గంలో గ్రామం నుంచి షాబాద్ వెళ్లే దారికి అడ్డంగా ముళ్ల కంప వేశారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మల్లేష్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా పొలానికి వెళ్లే బాటను కొందరు వ్యక్తులు ఆక్రమించి బాటను బంద్ చేశారని, ఈ విషయమై తాము తహసీల్దార్, ఆర్డీఓకు విన్నవించుకున్నా ఫలితంలేక కంపచెట్లు వేశామని, ఇలాగైనా తమ సమస్య తీర్చుతారేమోనని ఆశించి బాటకు అడ్డంగా ముళ్లకంపను వేశామని నిందితులు రాజు తెలిపారు.

పరిశుభ్రత, పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిప్రియ



విద్యార్థులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కొడంగల్ రూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతోనే ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంటుందని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.హరిప్రియ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్యదినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిప్రియ విద్యార్థులకు పలు సూచనలు ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, విద్యార్థినుల్లో హిమోగ్లోబిన్ స్థాయి తక్కువగా ఉందన్నారు. దీంతో ఆయాసం, అలసట, కల్లు తిరగడం తదితర సమస్యలు వస్తాయన్నారు. సమతుల ఆహారం, శారీరక వ్యాయామం, ధ్యానం, యోగాలాంటి ప్రక్రియలతో ఆరోగ్యం సిద్ధిస్తుందని చెప్పారు. కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలను నాటుతూ వాటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగం అధ్యాపకుడు రమేష్, ఐక్యూసీ సమన్వయకర్త టి.రాంబాబు, అధ్యాపకులు ఆర్.శ్రీనివాస్, యం.హరిప్రియ, ల్యాబ్ టెక్నీషియన్ రామ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతి

అనంతగిరి: గుర్తు తెలియని ఓ మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన వికారాబాద్ పట్టణంలో చోటుచేసుకుంది. సీఐ భీంకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం సమయంలో మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఓ గుర్తు తెలియని మహిళ చనిపోయి ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకుని వారు వివరాలు సేకరించారు. మృతురాలు అనారోగ్యంతో మృతి చెందినట్లు ఉందని, ఒంటిపై ఎర్రరంగుతో కూడిన నైటీ ఉందన్నారు. మృతురాలికి ఎడమ చేయి లేదని, వయసు45 ఏళ్ల వరకు ఉంటుందని భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో భద్రపరిచినట్లు పోలీసులు తెలిపారు. మహిళ గురించి ఏమైన సమాచారం తెలిస్తే వికారాబాద్ పీఎస్‌లో సంప్రదించాలన్నారు.

కల్తీ పదార్థాలు అమ్మితే చర్యలు

మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్



ఎన్టీఆర్ చౌరస్తాలోని ఓ స్వీట్‌హౌస్‌లో తనిఖీలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

అనంతగిరి: మున్సిపల్ పరిధిలోని హోటళ్లు, బేకరీలు, స్వీట్ షాపుల్లో కల్తీ పదార్థాలు విక్రయిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ హెచ్చరించారు. సోమవారం ఆయన ఇన్‌చార్జి శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసుతో కలిసి వికారాబాద్ పట్టణంలోని హోటళ్లు, స్వీట్‌షాప్‌లు, బేకరీల్లో ఆకస్మిక దాడులు చేపట్టారు. నిబంధనలు పాటించిన దుకాణాలు రూ.9వేల వరకు జరిమానా విధించారు. ఐఎస్‌ఐ ముద్ర ఉన్న వాటర్ బాటిల్స్ మాత్రమే అమ్మాలని సూచించారు. ప్లాస్టిక్ కవర్లను విక్రయించరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శ్రీనివాస్, సిబ్బంది శంకర్, వినోద్, చెన్నయ్య, రాజు, ఆశయ్య, జనార్దన్ తదితరులు ఉన్నారు.

వారం రోజుల్లో 'డబుల్' ఇళ్లు

మంచాల: లబ్ధిదారులకు వారం రోజుల్లో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేతుల మీదుగా డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేస్తామని ఇబ్రహీపట్నం ఆర్డీఓ అనంతరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని లింగంపల్లి గేట్ సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్రూం ఇళ్ల పంపిణీలో ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. పంపిణీకి ముందే నివాస యోగ్యానికి అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, ఉప్పరిగూడ పీఏసీఎస్ చైర్మన్ పాండు రంగారెడ్డి, ఎంపీడీఓ బాలశంకర్, తహసీల్దార్ ఎంవీ ప్రసాద్, హౌసింగ్ ఏఈ రాంచంద్రయ్య, నాయకులు కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి, ఎడ్మా నరేందర్‌రెడ్డి, జెనిగె వెంకటేశ్, మల్లేష్, మూర్తి, ఐలయ్య, కరుణాకర్‌రెడ్డి, భరత్‌రెడ్డి, రవి, రాజేశ్, ఆర్‌ఐ రమేశ్ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుడి మృతి



క్రీడాక్షేత్రం అధికారి శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నేతలు

యాచారం: ఓ కాంట్రాక్టు కార్మికుడు తీవ్ర అస్వస్థకు గురై మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని గునుగల్ క్రీడాక్షేత్రంలో చోటు చేసుకుంది. వివరాలు.. గునుగల్ గ్రామానికి మహ్మద్ జహంగీర్ కొన్నేళ్లుగా స్థానిక క్రీడాక్షేత్రంలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగానే విధులు నిర్వహిస్తుండగా సోమవారం ఉదయం 11 గంటల సమయంలో తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలిపోయాడు, గమనించిన కూలీలు వెంటనే యాచారం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ఆయన పరిస్థితి విషమించడంతో ఆయన్ను ఇబ్రహీంపట్నం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐటీయూ నాయకులు పి.బ్రహ్మయ్య, చందునాయక్ తదితరులు క్రీడా క్షేత్రం వద్దకు వెళ్లి మృతుడి కుటుంబానికి రూ.5లక్షల పరిహారం అందజేయాలని.. కుటుంబంలో ఒకరికి క్రీడా క్షేత్రంలో పర్మినెంట్ ఉద్యోగం కల్పించాలని కోరారు. ఈ మేరకు వారు క్రీడాక్షేత్రం అధికారి శ్రీకాంత్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు సంతానం.